

# కొత్త చదువులు

క్రొత్తగా చార్జీ పుచ్చుకొని, కొంచెం జంకుతూ క్లాసులోకి వచ్చిన సైన్సు మేష్టారుని చూచి చిరునవ్వు నవ్వింది చిన్న శారద. మేష్టారు క్లాసులోకి రాగానే లేచి నిలబడటం 20వ ఏట ఎలాగో ఫిఫ్త్‌ఫారాని కొచ్చిన చలపతికి సమంజసంగా తోచలేదు. సుందరిని చూస్తూ లేవడమే మర్చిపోయినాడు రెడ్డి.

"ఏమయ్యా! ఎక్కడున్నావు?" తడబడుతూ ప్రశ్నించారు మేష్టారు.

"ఇక్కడే" ధీమాగా అన్నాడు రెడ్డి కూర్చునే. ఫక్కున నవ్వేశారు నలభైమంది విద్యార్థులూ.

"మహారాజులాగ కూర్చునే మాట్లాడుతున్నావే" అన్నారు టీచరు డస్టరుతో మేజాపై కొడుతూ.

క్రొత్త మేష్టారవడం చేత రెడ్లు రాజ్యమేలినారనే విషయం చప్పున స్ఫురించ లేదు. రెడ్డి మాత్రం చలించలేదు. పైగా గర్వంగా చూశాడు సుందరి ముఖంలోకి. స్వతంత్రం వచ్చిన తర్వాత క్లాసురూమ్ లాంఛనాలకు ప్రాకులాడ గూడదనుకొని మేష్టారు పాఠం మొదలెట్టారు. వల్లించుకొచ్చింది నెమరవేసుకొంటూ "చలనము" అని బోర్డుమీద వ్రాశారు.

"ప్రపంచాన్ని రెండు భాగాలు చేశారు"

ఇంకా మేష్టారి వాక్యం పూర్తికాలేదు, వెంటనే అందుకొన్నాడు చౌదరి, "అవునండి, ఉత్తరార్ధగోళం, దక్షిణార్ధగోళం" మగపిల్లలంతా నవ్వేరు కాని ఆడపిల్లలు నవ్వనందుకు చౌదరికి అసంతృప్తిగానే ఉంది.

"అదిగాదయ్యా, ప్రాణులు, జడములు" అంటూ అందుకొన్నారు మేష్టారు, "ప్రాణుల ముఖ్యలక్షణాలు మూడు. కదులుట, పెరుగుట, సంతానాభివృద్ధి గావించుకొనుట. ఈ వేళ మొదటి విషయాన్ని గూర్చి నేర్చుకొందాం." అని ఉపోద్ఘాతం ముగించే సరికి క్లాసులో గొడవ ప్రారంభమైంది. "పక్షుల గమనము" అని ఇంకొక పదం బోర్డుమీద వ్రాసి మేష్టారు గ్రుక్క తిప్పుకోకుండా చెప్పుకుపోతున్నారు, "గాలిలో చొరుచుకొని పోవుటకు వీలుగా పక్షుల శరీరము పడవవలె నిర్మింపబడినది. ఎగురుటకు వీనికి రెక్కలు గలవు.

"సుబ్బన్న"

తోక చుక్కానివలె నుపయోగబడు చున్నది. ఉదాహరణ కాకి. కాకిని పరిశీలింపుడు.

"ఏదండీ" అన్నాడాచారి.

"అవేరా ఆమూల" రఫీమని సమాధాన మిచ్చేడు రెడ్డి. గొల్లుమన్నది క్లాసు. స్వర్ణ ముఖం మాత్రం ముడుచుకుపోయింది. మాస్టరుగారు మాత్రం ఆగలేదు.

"కాకికి ఎగురుటకు రెండు రెక్కలు కలవు. రెక్కలు తేలికగా నుండుటకు ఈకలతో చేయబడివున్నవి. ఈకమధ్యన ఈనగలదు. ఈన చివర బోలుగా నున్నది. ఈనె కిరువైపుల కేశికలు కలవు. కేశికలు చివరన చీలివున్నవి."

ముగ్గురు విద్యార్థులు ఒకేమాటు బయటికి పోవడంవల్ల మాస్టారు ధోరణికి బ్రేకుపడ్డది. పిల్లలంతా ఏమో అర్జంటు విషయాలు చర్చించుకొంటున్నారు. రంగరావు పాండురంగమూర్తి ఆ సాయంత్రం సినిమాకు పోవడానికి అప్పుడే తీర్మానించుకొన్నారు. ఫుల్లారావు మీదుగా వంగి ముందు బెంచీమీదనున్న సుందర్రావు చేతిలోని "ప్రేయసి" ప్రణయగాథల పత్రిక, లాక్కొన్నాడు కరీం. "చూడండి సార్" అంటూ సుందర్రావు కలియబడ్డాడు.

"ఏమిటోయ్ క్లాసులో కుస్తీలు" అంటూ మధ్యనున్న ఫుల్లారావు తప్పుకొన్నాడు. ఆరడుగుల కరీంని, తనకంటె రెట్టింపులావున్న సుందర్రావుని ఏమనగలరా కొత్త మేస్టారు? చూస్తూ నిలబడిపోయారు.

"చెప్పండి సార్" ఆజ్ఞాపించింది జ్ఞానాంబ.

"ఎవరూ వినందే చెప్పట మెందుకు?" అన్నారు మేస్టారు అయోమయంగా.

"నేను వింటున్నాను సార్. కాకి—రెండు రెక్కలు, రెక్కలకు ఈకలు, ఈకలకు ఈనెలు, ఈనెలచివర బోలు"—ఏకరువు పెట్టాడు శంకుమూతి ఉమాపతి. దబదబా బాదేశారు పిల్లలందరు బెంచీలమీద, ఉమాపతి నభినందిస్తూ. కొత్త మేస్టారు విస్తుపోయారు. "ఏమిటీ వుపద్రవ" మంటూ ఆదారినపోతున్న హెడ్మాస్టరుగారు లోపలికొచ్చారు కొంకి కర్రతో సహా. అంతా నిశ్శబ్దం. ఎవరూ కిం మ్మనలేదు. క్రొత్త మేస్టారు గాబరాపడుతున్నారు. క్లాసు చాలా పల్చగావుంది. "ఏం జరిగింది? శారదా నీవు చెప్పు" అధికారపూర్వకంగానే అన్నారు శ్రీవారు.

"అది కాదండీ, మేస్టారేమో ప్రపంచంతో మొదలెట్టి కాకి ఈకవరకూ వచ్చారు. ఇంతలోకే—" శారద కాటుకకళ్లు మిలమిలా మెరిసినై.

"ఏం జరిగిం దింతలోనే?" గర్జించారు హెడ్మాస్టరుగారు. బిక్కమొఖం పెట్టి శారద చూస్తూ ఊరుకొంది. సిగరెట్టు కాల్చుకోటాని కెళ్ళిన రెడ్డి చప్పున క్లాసులోకివచ్చాడు. "ఏం రెడ్డీ? ఎక్కడి కెళ్ళావ్?" కోపంగా అడిగారు కొంకి కర్రతో నేలమీద కొడుతూ.

"ఇన్సూరెన్సు ప్రీమియం ఈవేళే తెమ్మన్నారు గదండీ. అందుకని మా ఫాదర్‌తో మాట్లాడటానికి వెళ్ళాను."

"డబ్బు తెచ్చివా మరి?"

"సాయంకాల మిస్తామన్నారండీ."

"మరువకుండా తీసుకురా." టీచరువైపు తిరిగి "క్లాసు గొడవలేకుండా చూడండి. ఈ ట్రెయినింగ్ కాని వాళ్ళతో ఇదే ఇబ్బంది" అంటూ వెళ్ళిపోయినారు జరీ తలపాగా సరిదిద్దుకొంటూ. చేసేదిలేక చిరునవ్వుతో కూర్చున్నది చిన్న శారద. "కాకి పాఠం అయిపోయిందా అండీ" అన్నాడు చౌదరి స్వర్ణకేసి చూస్తూ. "కోతి పాఠం చెప్పండి" అన్నది ఉడుకుమోతుగా స్వర్ణ. ఆకలిగొన్న పులి, క్రొవ్వెక్కిన కొండ ముచ్చులు, అడవి పందులు కొండ చిలువలు ఖడ్గమృగాలు కనిపించాయి మేస్టారికి. గంట మ్రోగింది. బ్రతుకు జీవుడా అనుకొంటూ బయటబడ్డారు మేస్టారు. ఈలలు వేసుకొంటూ రొదచేసుకొంటూ తోసుకొంటూ గొడవ గొడవగా హెడ్మాస్టరుగారి గది ప్రక్కగా వెళ్ళిపోయినారు విద్యార్థులు.

* * *

రాత్రి 9 గంటలైంది. హోటల్లో భోజనం చేసి స్కూలు వసారాలో బల్లమీద పడుకొన్నారు కొత్తమేస్టారు. ఇంకా ఇల్లు కుదరలేదు వారికి. పైగా అన్నం వడ్డిస్తూ "ఈ బళ్లోకేమని వచ్చార"ని ప్రశ్నించింది పూటకూళ్ళమ్మ. 10 గంటలైంది. నిద్రపట్టలేదు. ఈ పాఠశా

లేమిటి? ఈ పిల్ల లేమిటి? ఈ అల్ల రేమిటి? ఈ హెడ్మాస్ట రేమిటి? ఈ పూ రేమిటి?—ఇవన్నీ ప్రశ్నలే మాస్టారికి. కాని పదిహేను, పద్దెనిమిది సంవత్సరాల పిల్లలకి కొకి ఈక పాఠ మేమిటని మాత్రం వారికి తట్టలేదు. బహుశా క్రొత్త ప్రణాళిక ననుసరించి వ్రాయబడిన పుస్తకం చదివి మరీ చెప్పినందువల్ల నేమో. స్కూలు గడియారం పదకొండు కొట్టింది. మసిగట్టిన లాంతరు చేతులో పెట్టుకొని, కాలి ఆరిపోయిన చుట్టముక్క నవతల పారేస్తూ నైటువాచరు వచ్చాడు. మేస్టారి అవస్థచూచి "ఏమండీ నిద్ర పట్టలేదా?" అన్నాడు ఆప్యాయంగా. "నిద్ర సరేగాని, ఈ స్కూలు మరీ అధ్వాన్నంగా ఉందేం? పాఠం చెబితే వినే వాడే లేడు."

"యెందుకింటారండీ. భ య ము ం టే గా? ఆదేందో ఇ న్స్పె క్ష న్ను అంట. అదిమాత్రం చేస్తారు. అంతే. చదవరు. అల్లరి ఆగడమూను."

"మరి పరీక్షల్లో ఫెయిల్ గారూ?"

"పరీక్షలేందండీ, చూసి రాయడమేగా! పైగా ఇన్స్పూరుచేస్తే అంతా పాసే."

"అది చెయ్యక పోతేనో?"

"చెయ్యకపోతే అయ్యాగారూరుకుంటూరా? ఫేల్ జేసెయ్యరూ!... ఓ ఎవరయ్యో! అంటూ పొలికేక పెట్టి, తూర్పు దిక్కున చప్పుడైతే గుడ్డిలాంతర పట్టుకొని ఆ వైపు వెళ్ళాడు నైటు వాచరు.

అటు వెళ్ళిన నై టు వా చ రు ప డ మ ర దిక్కుగా తిరిగివచ్చాడు.

"ఏమిటా చప్పుడు?"

"ఆ, ఏమీలేదండి. హెడ్మాస్టరుగారి పక్క ఆపాశలోని బల్లకేసి రుద్దుకొంది. ఆబల్ల ప్రక్కకి పడిపోయింది."

"వారిపక్క ఇక్కడెందుకున్నది?"

"అరి గొడ్లన్నీ ఇక్కడేగా! మా తాడు తెగుతోంది చాకిరీ చెయ్యలేక"

అంతటితో క్రొత్త మాస్టారేదో నిర్ణయాని కొచ్చినట్లు లేచి పక్క దులిపేసుకొన్నారు. మరునాటి ఉదయం క్రొత్త మాస్టారెక్కడా కనిపించ లేదు.

క థా ని క

# అ స లు ర హ స్యం ఇ దీ

## "సు లో చ న"

ఎప్పుడు సిగ్నలు చక్కవంగుతుందా, ఎప్పుడు రైలు వస్తుందా, ఎప్పుడు మామగారింటి కెళ్ళి బుల్లాణ్ణీ, పాపాయినీ, లలితనీ, అత్తయ్యనీ, మామయ్యనీ చూద్దామా – అనే ఆలోచనలో, ఆదుర్దాలో; అక్కడ ఆ కటకటాల దగ్గర, ఎలక్ట్రిక్ స్తంభం క్రింద అంతమంది జనం ఎందుకు కూడిందీ చూడలేకపోయాను గాని, విచారించలేకపోయానుగాని – మొత్తానికి ఆదృశ్యం చూశాక ఆ సంబర మేమిటో చూడాలనేది నాలో బలంగా రేకెత్తగా,–'ఏమే! సులోచనా! ఎక్కడికే అటూ, ఆ అలగా గుంపులోకి?' అని అమ్మ వెనకాల ఎన్ని మొత్తుకున్నా ఆ జనానికి పది గజాల దూరంలో వెళ్ళి నిలబడ్డాను; పదహారేళ్ళ పడుచునుగదా, రేపోమాపో గొప్పవాడి భార్యనయ్యే దానిని గదా ఆ గుంపుదగ్గర కెళ్ళి, అందరూ తనవంకే, తన సౌందర్యంవంకే చూస్తుంటే ఎంత లోకువగా వుంటుందీ-అసలీ ఆలోచన రానేలేదని కాదుగాని ఆ సంబరం చూడాలనీ, తెలుసుకోవాలనీ. ఇది హోదాకి ఏం భంగం?

చుట్టూ జనం చుట్టేసివున్నారు, అన్ని రకాలవాళ్లు వున్నారు. చుట్టా బీడీ సిగిరేట్ అమ్మేవాడి దగ్గర్నుంచీ రెండు వందల మైళ్లు ప్రయాణం చేసేవాళ్లదాకా వున్నారు. అయితే వొకటి. వీళ్ళేవరూ ఆ దృశ్యానికి సంబంధించిన విపత్కర తీరని సమస్యని పరిష్కరించటానికి